# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం, 24 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## మీడియాపై విశ్వాసాన్ని కలిగించాలి



## కొండెక్కిన నిత్యవసరవస్తువుల ధరలు



మిగతా 3లో..

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం : మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 23:** ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామనీ, వారు తమ సమ్మెను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీజిల్,పెట్రోల్ ఆటోలను రెటిరోఫిట్మెంట్ చేసుకోవడా నికి రూ. 1.50 లక్షలు ఆర్థిక సహాయం చేయడానికి కొత్త పథకం తీసుకొస్తున్నామని తెలిపారు. 2015 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదనీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఆ కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి, అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. ఇప్పటికే క్యాబినెట్‌లో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని మిగతా 3లో..

## వెయ్యి రోజుల కాంగ్రెస్ దగాపై సమరభేరి..

- సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ ఆందోళనలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..



**హైదరాబాద్, ఆగస్టు 22:** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి మోగించనున్నది. సబ్బండవర్గాలను దగా చేస్తున్న సర్కార్‌ను ఎండగట్టేందుకు సిద్ధమైంది. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి.. వంద రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి.. 13 డిక్లరేషన్ల పేరిట 420 హామీలు అమలు చేస్తామని ఊదరగొట్టి.. అన్ని వర్గాలను నట్టేట ముంచు తున్న కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పెద్దఎత్తున కార్యాచరణ సిద్ధం చేసింది బీఆర్ఎస్. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, వినూత్న నిరసన కార్యక్రమాలతో సర్కార్ మోసాలు, వైఫల్యాలను ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. ముఖ్యంగా యువతను ఆకట్టుకొనేలా ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఈ మేరకు ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీ బాధ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు సూచనలు, సలహాలతో నేతలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనలో చేసిన మోసాలు, హామీల అమల్లో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికీ చేరేలా వారంపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## నాసిరకం యూనిఫారాల పంపిణీపై విచారణ



### మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 23 :** నాసిరకం యూనిఫారాల పంపిణీపై విచారణ జరపాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా? అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాసిరకం యూనిఫారాల పంపిణీపై హరీశ్‌రావు ఆదివారం ఎక్స్ ద్వారా స్పందించారు. ఇదేనా అంతర్జాతీయ ప్రమాణాలు రేవంత్ రెడ్డి?అని అడిగారు. ఒకచోట యూనిఫారాలు అందలేదనీ, అందినచోట కొలతలు సరిగ్గా లేవనీ, కుట్లు ఊడిపోతున్నాయని తెలిపారు. ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయనీ, రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ తెలంగాణ చేనేత కార్మికులపై లేదని తెలిపారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి కమీషన్ల కోసం బడా కార్పొరేట్ల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేశారని విమర్శించారు. "మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు" అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా?అని ప్రశ్నించారు. చేనేత కార్మికుల ఉపాధికి గండి విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అని తెలిపారు.

## ఈ ప్రభుత్వం ఐదేండ్లు కష్టమే రామచందర్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 22:** కాంగ్రెస్‌లో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కొట్లాటలు చూస్తు ంటే ఈ ప్రభుత్వం ఐదేండ్లు కొనసాగడం అను మానమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాం చందర్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏ పార్టీకైనా ప్రజలు ఐదేండ్లు పాలించే అవకాశం ఇస్తారని, కానీ ప్రస్తుత సర్కార్ పనితీరు బాగా లేక పోవడంతో మధ్యలోనే కూలిపోయినా ఆశ్చ ర్యం లేదని చెప్పారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లా డుతూ కొండా సురేఖ వ్యవహారంపై వ్యాఖ్యానిం చనంటూనే దోచుకోవడం ఎక్కువవుతున్నదని, దోపిడీ కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం తోనే కొట్లాటలు వస్తున్నాయని వ్యాఖ్యాని ంచా రు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే కాంగ్రెస్ అంటనే కరెప్షన్ అని రుజువైందని తెలిపారు.

## కాళేశ్వరంపై కుట్రలు తేటతెల్లం..

- సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదికతో కాంగ్రెస్, బీజేపీ నాటకం బట్టబయలు
- ఇప్పటికైనా తప్పు అంగీకరించి కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పాలి
- కాంగ్రెస్ పాపం.. రైతులకు శాపం
- గోదావరి, కృష్ణా నీటి వినియోగంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 22:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై సీడబ్ల్యూపీఆర్ఎస్ ఇచ్చిన నివే దికతో రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ కలిసి గత మూడేళ్లుగా సాగిస్తున్న కుట్ర తేటతెల్లమైందని, ఎన్డీఎస్ఏను బూచిగా చూపుతూ ఆడిన నాటకం బూటకమనే విషయం బట్టబయలైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ధ్వజ మెత్తారు. ఆ రెండు బరాజ్‌లు సురక్షితమని చెప్పడంతో కాంగ్రెస్, బీజేపీకి ముఖం చెల్లకుండా పోయిందని వ్యాఖ్యానించారు. ఇం తకాలం బీఆర్ఎస్‌ను బదనాం చేసిన ఆ రెండు పార్టీల నేతలు ఇప్పటికైనా తమ తప్పు ఒప్పుకోవాలని, మాజీ సీఎం కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## నేడు కాంగ్రెస్ అత్యవసర సమావేశం



**హైదరాబాద్, ఆగస్టు 23:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో చోటుచేసుకొంటున్న తాజా పరిణామాల నేపథ్యంలో సోమవారం టీపీసీసీ అత్యవసర సమావేశం ఏర్పాటుచేసింది. సాయ ంత్రం 5.30 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ నేతృత్వంలో సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలి పాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్య క్షులు, 'సర్' కో-ఆర్డినేటర్లతో అత్యవసర జూమ్ సమావేశం ఏర్పాటు చేసినట్టు వెల్లడించాయి. కానీ, పార్టీ నేతల విభేదాలపై అభిప్రాయాలు తెలుసుకోనున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

## గుట్టలా పేరుకుపోతున్న పెండింగ్ బిల్లులుమ

- నెలకు 500 మంది చొప్పున ఉద్యోగుల రిటైర్డ్
- నెలనెలా ఇస్తున్నా పెరుగుతున్న బకాయిల
- రిటైర్డ్, రెగ్యులర్ ఉద్యోగులకూ తప్పని తిప్పలు




**హైదరాబాద్, ఆగస్టు 22:** రాష్ట్రంలో ఉద్యోగులు పెండింగ్ బిల్లుల కథ మళ్లీ మొదటికొచ్చింది. తాజా వివరాల ప్రకారం.. పెండింగ్ బిల్లుల మొత్తం రూ. 8వేల కోట్లకు చేరింది. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడంలో భాగంగా ప్రభుత్వం ప్రతినెలా కొంత నగదు విడుదల చేస్తున్నది. గతంలో రూ. 11వేల కోట్ల బకాయిలుండగా.. ప్రతినెలా సర్కార్ ఎంతోకొంత చొప్పున విడుదల చేస్తున్నా మళ్లీ బకాయిలు పోగవుతున్నాయి. తొలుత నెలకు రూ. 700 కోట్ల చొప్పున చెల్లించింది. ఆ తర్వాత రూ. 1,000 కోట్లకు పెంచింది. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ క్లియర్ చేయడంలో భాగంగా సర్కార్ మూడు మిగతా 2లో..

## గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం నేలమట్టం..



## అంజయ్యనగర్‌లో భారీ కూల్చివేతకు సిద్ధమైన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 23:** గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మా ణాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే భవనం కూలిపోయిన ఘటనతో అప్రమత్తమైన అధికారులు, డ్యామేజ్ అయిన పక్క భవనాన్ని కూల్చి వేయడానికి రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం భారీ బాహుబలి యంత్రాన్ని ఘటనా స్థలానికి తరలించారు. ఆరు అంతస్తుల భవనం కూల్చివేతకు అధి కారులు ఏర్పాట్లు పూర్తి చేసిన ప్పటికీ, వర్షం కారణంగా పనులకు తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. వర్షం తగ్గిన వెంటనే కూల్చివేత పనులు ప్రారంభించే అవకాశం మిగతా 3లో..



## రక్షణ పరికరాల సరఫరాలో సింగరేణి నిర్లక్ష్యం!..

- తీవ్ర ఇబ్బందుల్లో కార్మికులు
- అందుబాటులో లేని డ్రిల్‌రాడ్లు, బిట్లు, పైకప్పు సపోర్టులు
- పాత మెషిన్లు రిపేర్ చేసి వాడకం
- పట్టించుకోని యాజమాన్యం

వివరాలు 2లో..

## 22ఏ రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తం



- వేలాది మంది బాధితులతో సచివాలయాన్ని ముట్టడిస్తం
- 22ఏ ప్రభావిత ప్రాంతాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటన
- మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో 'నిషేధిత' బాధితులకు భరోసా

వివరాలు 3లో..

# పీఏసీఎస్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించిన రెడ్డి సంఘం సభ్యులు...



బలగం టీవీ, ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పీఏసీ ఎస్ చైర్మన్ ఉట్కూరి వెంకటరమణ రెడ్డిని ఇల్లంత కుంట రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు శనివారం సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. చైర్మన్‌తో పాటు పీఏసీఎస్ డైరెక్టర్లను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటరమణ రెడ్డి మాట్లాడు తూ.. తనపై నమ్మకంతో పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే సత్యనారా యణకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను సన్మానించిన రెడ్డి కులబంధువులకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన.. సంఘ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సిరిసిల్ల కార్యవర్గ సభ్యులు కంకణాల శ్రీనివాసరెడ్డి, ఇల్లంతకుంట రెడ్డి సంఘం అధ్యక్షుడు గడ్డం రవీందర్ రెడ్డి, చిట్టి కృష్ణారెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, కంది రాజిరెడ్డి, కట్ట నరసింహ రెడ్డి, సింగిరెడ్డి ఎల్లారెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, మహేందర్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఒకే గ్రామానికి రెండు పంచాయతీలు...

- కంచుగట్లగూడెం గ్రామంలో విచిత్ర పరిస్థితి
- రెండు పంచాయతీలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



హైదరాబాద్, ఆగస్టు 23 : తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోనినాగారం మండల కేంద్రంలోనికంచుగట్లగూడెం (గొల్లగూడెం) గ్రామంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏ ఊర్రికైనా ఒక సర్పంచ్... ఒకటే గ్రామపంచాయతీ, ఒకటే మండలం ఉంటుంది. కానీ ఈ గ్రామానికి మాత్రం ఇద్దరు సర్పంచ్‌లు ఉండడం విశేషం. అంతే కాదు.. ఈ పల్లె రెండు పంచాయతీలే కాదు.. రెండు మండలాల పరిధిలో ఉంది. అన్నీ డబుల్ డ బుల్‌ఉన్నట్లే సమస్యలు కూడా రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. గ్రామంలో ఇలా...కంచుగట్లగూడెం గ్రామంలో మొత్తం 50 కుటుంబాలు, 147 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12 కుటుంబాలను (42 మంది ఓటర్లు) జాజిరెడ్డిగూడెం మం డలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామానికి, మిగిలిన 38 కుటు ంబాలు (105 మంది ఓటర్లు)ను నూతనంగా ఏర్పాటు చేసిన నాగారం మండలంలోని పేరబోయిన గూపడెం గ్రామ పంచాయతీకి కేటాయించారు. దీంతో ఇక్కడి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో పని నిమిత్తం కొంత మంది 6 కిలోమీటర్లు దూరంలో ఉన్న జాజిరెడ్డిగూడెం మండల కేంద్రమైన అర్వపల్లికి వెళ్లాలి. అలాగే మరికొంత మంది 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగారంబంగ్లాకు వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడి ప్రజలు రెండు మండలాలకు చెందిన వారు కావడంతో ఆయా మండలాల అధికారులు పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు ఏ మండలానికి చెందిన వారో నిర్ధారించుకోలేక కొన్నిసార్లు అయోమయానికి గురవుతూ వారిని రెండు మండల కేంద్రాల చుట్టూ తిప్పుతున్నారు.
ఇద్దరు సర్పంచ్‌లతో అభివద్ధికి ఆటంకం..కంచుగట్లగూడెం గ్రామం రెండు గ్రామ పంచాయతీ మధ్య ఉండి ఇద్దరు సర్పంచ్‌లు ఆద్వర్యంలో ఉండటంతో ఇరువురి మధ్య పోటీతో అభివద్ధికి ఆటంకం కలుగుతుంది. గ్రామంలో మురుగు కాల్వల శుభ్రత, వీధి దీపాలు, గ్రామసభల నిర్వహణ విషయాల్లో రెండు పంచాయతీల మధ్య ఇక్కడి ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతూ వెనకబడిపోతున్నారు. దీంతో తమ గ్రామాన్ని మొత్తంగా దగ్గరలో ఉన్న పేరబోయినగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోకి తేవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి...




బలగం టీవీ, బోయినిపల్లి: వాణిజ్య పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభా లు పొందవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌కుమార్ అన్నారు. శనివారం బోయినిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వాణిజ్య పంటలను ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. రత్నంపేటలో విజయ, సత్యం దంపతులు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను, రామన్నపేటలో మిట్టపల్లి కమలాకర్‌రెడ్డి సాగు చేస్తున్న బూడిద గుమ్మడి, రాస గుమ్మడి పంటలను పరిశీలించారు. దేశాయిపల్లిలో ఒంటెల వీరారెడ్డి సాగు చేస్తున్న టమాట, మునగ పంటలను, మర్లపేటలో భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ తోటను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి ప్రణీత రైతులతో పంటల సాగు విధానాలు, దిగుబడులు, మార్కెటింగ్ అంశాలపై చర్చించారు. నాణ్యమైన విత్తనాలు వినియోగించడం, సమతుల్య ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, తెగుళ్లు--కీటకాల నివారణ చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉద్యాన వన శాఖ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు. మార్కెట్‌లో వాణిజ్య పంటలకు మంచి డిమాండ్ ఉన్నందున శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి మెరుగైన ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించేందుకు ఉద్యానవన శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# పెట్రోగి పోతున్న మట్టి మాఫియా తవ్వకాలు



- తూర్పు గూడెం చెరువులో యదేచ్ఛగా మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు... వారి కనుసన్నల్లోనే దందా
- అధికారుల మౌనంపై గ్రామస్తుల ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 23 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం, తుంగతుర్తి మండలం పరిధిలోని తూర్పు గూడెం గ్రామంలో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా స్థానిక చెరువులో మట్టి దళారులు భారీ యంత్రాలతో ప్రమాదకరమైన లోతైన గుంతలు తవ్వుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు అక్రమ తవ్వకాల వల్ల చెరువులో ఏర్పడుతున్న లోతైన గోతులు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. గ్రామానికి చెందిన పశువులు, గొర్రెలు, మేకలు మేత కోసం చెరువు పరిసరాల్లోకి వెళ్లినప్పుడు ఆ గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పశుపోషకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు లేదా చిన్న పిల్లలు చెరువులోకి దిగితే ప్రమాదవశాత్తూ లోతైన గుంతల్లో పడి మునిగిపోయే అవకాశం ఉందని, ఇది తీవ్ర ప్రాణనష్టానికి దారితీస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వత్తాసుపై తీవ్ర విమర్శలు ఈ అక్రమ తవ్వకాలపై ఇరిగేషన్ శాఖ ఏఈ, డీఈ లను వివరణ అడగగా... తమ వద్ద నుండి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని చెబుతున్నారు. నిన్ననే తవ్వకాలను ఆపేశామని అధికారులు నిరభ్యంతరంగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం మట్టి దళారులు అధికారులతో చేతులు కలిపి నేటికీ యదేచ్ఛగా దందాను కొనసాగిస్తూనే ఉన్నారు. కళ్లెదుటే అక్రమంగా మట్టి తరలిపోతున్నా అధికా రులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, మట్టి మాఫియాకు సపోర్టుగా నిలుస్తున్నారని గ్రామస్తులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే పూర్తిగా నిలిపివేసి, గ్రామానికి మరియు పశువులకు రక్షణ కల్పించాలని తూర్పు గూడెం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మట్టి మాఫియా దళారులతో పాటు, వారికి పరోక్షంగా సహకరిస్తున్న ఆరోపణలు వెలువెత్తుతు న్నాయి. ఇరిగేషన్ అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆశా కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఉద్యోగ భద్రత 18 వేల వేతనం ఇవ్వాలని ఆశకార్యకర్తల డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 23 : తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశ కార్యకర్తలు శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం డాక్టర్ లింగమూర్తికి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు మేకల జయమ్మ మాట్లాడుతూ...ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచాలని 18000/- వేల రూపాయల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏండ్ల అవుతున్న ఇంతవరకు అమలు చేయలేద న్నారు. ఆశా కార్యకర్త మరణిస్తే 50 వేల రూపాయలు ఎక్స్రేషియో ఇస్తామని నేటి వరకు కూడా అమలు చేయలేకపోవడం తో ఆశ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే ఆశా వర్కర్ల సమస్యలను స్పందించి మా డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోమన్న మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



హైదరాబాద్, ఆగస్టు 23 : మండల పరిధిలోని కోడూరు గ్రామ సర్పంచ్ వల్లపు అవిలమ్మ భర్త సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వల్లపు సోమయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. ఆదివారం కోడూరులో గుండెపోటుతో మరణించిన సీని యర్ కాంగ్రెస్ నాయకులు వల్లపు సోమయ్య భౌతిక గాయానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు, జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, వ్యవసాయ కమిషన్ నెంబర్ చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ సామా అభిషేక్ రెడ్డి, సోమన్న కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, డిసిసి సెక్రెటరీ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేల్పుల రమేష్ ముదిరాజ్, మాజీ జెడ్పిటిసి అవిలయ్య, గ్రామ శాఖఅధ్యక్షుడు, రవీందర్ పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం నేలమట్టం..




## ఇద్దరు కార్మికుల మృలితి...

బలగం టీవీ, మాదాపూర్: హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో శని వారం మధ్యాహ్నం ఘోర భవన ప్రమాదం చోటు చేసుకుంది. నాలా పక్కనే నిర్మించిన ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు నిర్మాణ కార్మికులు మృతిచెం దారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, ఎస్ఆర్ఎఫ్, సీఎంసీ బృందాలు భారీ యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టి మృతదే హాలను వెలికితీశాయి. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా గుర్తించారు. భవనం శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో అది కూడా పాక్షికంగా దెబ్బతింది. అపార్ట్‌మెంట్‌లోని ఇద్దరు వృద్ధులు గాయపడినట్లు సమాచారం. సమీపంలోని హాస్టల్ విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ తెలిపారు. భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటించారా? నిర్మాణ నాణ్యత ఎలా ఉంది? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. భవనానికి సంబంధించిన బిల్డర్ సాజిద్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

# నిరుద్యోగులకు నిరాశ మిగిల్చిన జాబ్ క్యాలెండర్

- సిపిఎం రాష్ట్రకమిటీ



హైదరాబాద్, ఆగస్టు 23: ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : రాష్ట్రప్రభుత్వం-2026 జాబ్ క్యాలెండర్‌లో కేవలం 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం లక్షలాదిమంది నిరుద్యో గులకు తీవ్ర నిరాశను కలిగించిందని సిపిఎం రాష్ట్రకమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని, గిరిజన నిరుద్యోగులకు స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసు శాఖలోనే 20వేల ఖాళీ పోస్టులున్నట్లుగా స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. కనీసం 10వేల పోస్టులైనా భర్తీ చేయాలని నిరుద్యోగులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వం ప్రకటించిన దానికంటే 4రెట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. మెగా డిఎస్సి ప్రకటిస్తారని ఎదురుచూసిన నిరుద్యోగులకు గతేడాది కేవలం 16వేల పోస్టులకు మాత్రమే పరీక్ష నిర్వహించారని వివరించారు. ఇంకా విద్యాశాఖలోనే మరో 20వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. స్కూళ్లు మూసేసివేయడం గానీ తగ్గించేసి ఉద్యోగాలకు కోత పెట్టారని పేర్కొన్నారు. గిరిజన నిరుద్యోగులకు స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్నా రాష్ట్రప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని పేర్కొన్నారు. దానికి మూలమైన జివో 3ను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లి కేవలం 10వేల ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించి గొప్పలు చెప్పుకోవడం ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. నిరుద్యోగుల వయోపరిమితిని కూడా సడలించి ఎక్కువమందికి అవకాశం కల్పించాలని కోరారు. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన

## సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు



హైదరాబాద్, ఆగస్టు 23 : వర్షాకాలం సీజన్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సీజనల్ వ్యాధులను ఏ విధంగా, నిర్మూలించాలి అదేవిధంగా గ్రామాల్లో పెరుగుతున్న ,గంజాయి డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తమ పాటల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని తెలంగాణ సంస్కృతి సారథి సూర్యాపేట జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు అన్నారు. ఆదివారం జారెడ్డిగూడెం మండల పరిధిలోని సీతారాం పురం గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామంలో కూడా వన మహోత్సవాలు, వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన, గంజాయి డ్రగ్స్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు తో పాటు ఈర్ల సైదులు, శంకర్ ,లక్ష్మి, మేడిపల్లి వేణు, రాధ, శిరీష పాల్గొన్నారు.

# (మొదటిపేజీ తరువాయి)

## 22ఏ రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తం

హైదరాబాద్, ఆగస్టు 22: 22ఏ రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 22ఏ నిషేధిత జాబితా ముసుగులో ప్రజల ఆస్తులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కుట్రపూరితంగా సిద్ధం చేసిన 22ఏ నిషేధిత జాబితాను తక్షణమే రద్దు చేయకపోతే వేలాది మంది బాధితులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ పరిధిలోని తిరుమల మె డోస్, లక్ష్మీగణపతి, హేమనగర్ కాలనీల్లో ప్ర భావిత ప్రజలకు బీఆర్ఎస్ భరోసానిచ్చేలా ఏ ర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు.

## బాకీ 8 వేల కోట్లు.. గుట్టలా పేరుకుపోతున్న పెండింగ్ బిల్లులు

నెలలుగా రూ.2వేల కోట్ల చొప్పున విడుదల చేస్తున్నది. రిటైర్మెంట్ బెనిఫిట్లు రూ.6 వేల కోట్లు క్లియర్ చేసింది. ఈ నెల నుంచి మళ్లీ రూ.2,000 కోట్లు విడుదల చేస్తుందా? లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నెల నుంచి నెలకు రూ.700 కోట్లు విడుదల చేసే అవకాశమే ఉన్నదని తెలుస్తున్నది. పెండింగ్ బిల్లులు రూ.8 వేల కోట్లకు చేరడంతో నెలకు రూ. 2,000 కోట్ల చొప్పున ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు ఉన్న పెండింగ్ బిల్లులను చెల్లిస్తుండగా, మరోవైపు బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రతినెలా 500 మంది ఉద్యోగుల రిటైర్డ్ అవుతున్నారు. వీరికి అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ నెలకు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్లు అవసరం అవుతున్నాయి. 2027 మార్చి వరకు నెలకు రూ.2,000 కోట్ల చొప్పున విడుదల చేస్తేనే బిల్లుల బకాయిలు తీరుతాయి. అంతకు తక్కువగా నగదు విడుదల చేస్తే 2028 కూడా దాటే అవకాశం కనిపిస్తున్నది. ఉద్యోగులు అడిగినవి ఇవ్వకుండా ప్రభుత్వం అడుగని వాటిని విడుదల చేసింది. ఉద్యోగులు సరెండర్ లీవులు (ఈఎల్), టీజీఎల్ఐ, గ్రూప్ ఇన్స్యూరెన్స్, జీపీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. కానీ ప్రభుత్వం జడ్పీ జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్, కమ్యూటేషన్, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ క్లియర్ చేసింది. దీంట్లో కమ్యూటేషన్ 100శాతం క్లియర్ చేసింది. వాస్తవానికి దీనిని ఉద్యోగులు అడుగనేలేదు. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు 10శాతం వాటాను ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. ఇది కూడా చెల్లించడంలేదు. నెలకు కొంత నగదు చొప్పున పెండింగ్ బిల్లులు విడుదల చేస్తున్నా.. మళ్లీ కొత్త బకాయిలు పోగవుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న ఆ కొద్ది మొత్తం నగదుతో పూర్తి బకాయిలు ఇప్పట్లో తీరేలా కనిపించడంలేదు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలే కాకుండా రెగ్యులర్ ఉద్యోగుల బకాయిలు కూడా చెల్లించాల్సి ఉన్నది. నెలనెలా రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయాలి. అలా చేస్తేనే పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అవుతాయి. లేదంటే ఈ బకాయిలు పేరుకుపోతాయి.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో కార్మికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చే రెట్రోఫిట్మెంట్‌కు రూ. 1.50 సహాయం అందించాలని నిర్ణయం జరిగిందని వివరించారు. పాత ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసుకునే వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని హామీనిచ్చారు. హైదరాబాద్‌లో దశలవారీగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని హామీనిచ్చారు.

## ఇంకా అందని నగదు రహిత వైద్యం

- ఈహెచ్ఎస్ అమలుపై ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన
- ప్రభుత్వం పారదర్శకత పాటించాలి
- టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు గుండవరం దేవీప్రసాద్



హైదరాబాద్, ఆగస్టు 22: ఈ నెల 17 నుంచి నూతన ఈహె చ్ఎస్ (ఉద్యోగుల ఆరోగ్య పథకం) అమల్లోకి వచ్చిందని ప్రభు త్వం ప్రకటించినా, దవాఖానల్లో ఉద్యోగులు, ఉపాధ్యా యులు, పెన్షనర్లకు వాస్తవంగా నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్యం అందడమే లేదని తెలంగాణ ఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు గుండవరం దేవీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు.ప్రభుత్వం భిన్నమైన ప్రకటనలతో ఈహె చ్ఎస్ అమలుపై ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన నెలకొన్నదని, ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నూతన పథకం ద్వారా 4,440 మంది లబ్ధి పొందారని ప్రభు త్వం చెప్తున్నా.. లబ్ధిదారుల పేర్లు, చికిత్స అందించిన దవాఖా నలు, అందించిన వైద్యచికిత్సలు, ఖర్చుల వివరాలను తక్షణమే అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతాల నుంచి మే నెల నుంచే ఈహెచ్ఎస్ ప్రీమియం వసూలు చేసి, ఆగస్టు 17 నుంచి పథకాన్ని అమలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.

### ఓపీ సేవలు, పరీక్షలు కల్పించాలి

అన్ని ఎంప్యానెల్డ్ ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లోనూ నగదు రహితంగా ఈహెచ్ఎస్ ఓపీ (ఓపీ ) సేవలను అందుబాటులోకి తేవాలని దేవీప్రసాద్ కోరారు. పెన్షనర్లకు ప్రతి ఆరు నెలలకో సారి సమగ్ర ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయాలని కోరారు. తక్షణమే ఇన్‌పేషెంట్, ఓపీ క్యాష్‌లెస్ సేవలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని , ఈ సమస్యల పరిషారానికి సీఎం స్పందించి జేఏసీ(జాక్)ప్రతినిధులతోచర్చలు జరుపాలని డిమాండ్ చేశారు.

## మీడియాపై విశ్వాసాన్ని కలిగించాలి

- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్‌క్లబ్స్ జాతీయ సదస్సులో

'ది హిందూ' గ్రూప్ డైరెక్టర్ ఎన్ రామ్




హైదరాబాద్, ఆగస్టు 22: ప్రజల్లో మీడియాపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు జర్నలిజం తన మూల సూత్రాలైన క్షేత్రస్థాయి రిపోర్టింగ్, పరిశోధనాత్మక జర్నలిజం, సుదీర్ఘ కథనాలు, వివరణాత్మక వార్తా విశ్లేషణకు తిరిగి రావాలని 'ది హిందూ' గ్రూప్ డైరెక్టర్, ప్రముఖ జర్నలిస్టు ఎన్ రామ్ పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆది వారం ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్‌క్లబ్స్ జాతీయ సద స్సులో నిర్వహించిన ప్యానెల్ చర్చలో ఆయన మా ట్లాడుతూ.. మీడియా సంస్థలు స్వీయ నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసుకోవడంతోపాటు జర్నలిస్టుల కోసం పారదర్శక ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలని సూచించారు. డిజిటల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల విస్తరణతో సంప్రదాయ జర్నలిజం పద్ధతులు ప్రాధాన్యం కోల్పోవని పేర్కొన్నారు. జర్నలిస్టులపై కేసులు, ఆన్‌లైన్ ట్రోలింగ్‌లు, బెదిరింపులు భావప్రకటనా స్వేచ్ఛకు సవాళ్లు విసురుతున్నాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. జర్నలిజం కోసం జర్నలిస్టులు, పాఠకులు భాగస్వాములయ్యే కొత్త ఆర్థిక నమూనాలు అవసరమని 'ఆల్ట్ న్యూస్' సహ వ్యవస్థాపకుడు, ఎడిటర్ ప్రతీక్ సిన్హా తెలిపారు. ప్రింట్ మీడియా ఇప్పటికీ కచ్చితమైన, లోతైన సమాచారాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నదని 'సియాసత్' డైలీ డిజిటల్ డెస్ ఎడిటర్ సయ్య దా ఫైజా కిర్మానీ పేర్కొన్నారు. ఈ చర్చకు 'ది కారవాన్' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ హర్తోష్ సింగ్ బాల్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి ప్యానలిస్టులుగా, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు, 'ది వైర్' మాజీ నేషనల్ అఫైర్స్ ఎడిటర్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్‌క్లబ్స్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ సంగీత బరూవా పిషారోటి, జర్నలిస్ట్ ఉమా సుధీర్ మోడరేటర్లుగా వ్యవహరించారు. అతిథులను హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్‌క్లబ్స్ ఉపాధ్యక్షుడు ఎస్ విజయకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ వరికుప్పల సతరించారు.

## గిరిజన సమస్యలు పరిష్కరించాలి


- విజయవంతం చేయాలని ప్రజాసంఘాల పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 23: గిరిజన వాడల్లో కెవిపిఎస్, వ్యవ సాయ కార్మిక సంఘం, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక శంఖారావంలో భాగంగా పలు జిల్లాల్లో ఆదివారం దళిత గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్వహించే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సామాజిక శంఖారావం అధ్యయన యాత్రల్లో సర్వే చేశామని వారు తెలిపారు. నెల్లూరు రూరల్ పరిధిలోని 24వ డివిజన్, ఆర్‌డిటి కాలనీలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రెహనా బేగం, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, కెవిపిఎస్ రూరల్ కార్యదర్శి ఎన్ మాలకొండయ్య మాట్లాడుతూ సోమవారం విఆర్సి గ్రౌండ్ నుండి జరిగే ర్యాలీలో ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆర్‌డిటి కాలనీలో ఎస్‌టి, ఎస్‌సి సబ్ ప్లాన్ ద్వారా నిధులు ఖర్చుపెట్టి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగే ధర్నా జయప్రదం కోసం ప్రచారం నిర్వహించారు. ప్రచారాన్ని కౌలురైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు ప్రారంభించి మాట్లాడారు. విజయ నగరం ఎల్‌బిజి భవనం నుంచి కోట జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు సిఫారసులు, పున్నయ్య కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం అమలు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంలోని లొసుగులు వల్ల దళితులు, గిరిజనులపై జిల్లాలో దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ జివిఎంసి ఒకటో వార్డు సంతపేట దళిత కాలనీలో ప్రజాసంఘాల నాయకులు పర్యటించారు. స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమం పోస్టర్‌ను కొమ్మాది కూడలిలోని సిఐటియు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. జివిఎంసి నాలుగో వార్డు పరిధి సోమన్నపాలెం, నేరెళ్లవలస ఎస్‌సి కాలనీ ప్రాంతాల్లో సిఐటియు, కెవిపిఎస్ నాయకులు పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.

## కొండెక్కిన నిత్యవసరవస్తువుల ధరలు

- అంటకాగుతున్న వంటనూనెలు..
- చేదెక్కిన చెక్కెర.. భారీగా పెరిగిన బియ్యం, ఉప్పు, పప్పుల ధరలు
- ఆహార ద్రవ్యోల్బణం..దిద్దుబాటు చర్యల్లో మోడీ సర్కార్ వైఫల్యం



హైదరాబాద్, ఆగస్టు 23:

గడచిన రెండేండ్లలో దేశవ్యాప్తంగా వంటగది సరుకుల చిల్లర ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వినియోగ వ్యవహా రాల శాఖకు చెందిన ధరల పర్యవేక్షణ విభాగం నమోదు చేసిన చిల్లర ధరల డేటాను సౌత్ ఫస్ట్ అనే సంస్థ విశ్లేషిం చింది. 2024-2026 సంవత్సరాల్లో ఆగస్టు 18న నమోదైన ధరలను పరిగణనలోకి తీసుకుంది. కేరళకు సంబంధించిన కొన్ని గణాంకాలు అందుబాటులో లేవు. 2022 ఆగస్టుతో మొదలైన ఐదేండ్ల కాలంలో బియ్యం, పాలు, చక్కెర ధరలు బాగా పెరిగాయని ఆ సంస్థ తెలిపింది. ఇటీవలి కాలంలో పొద్దుతిరుగుడు నూనె ధర కూడా చాలా ఎక్కువగా ఉంటోంది. ఉదాహరణకు తెలంగాణలో కిలో పొద్దుతిరుగుడు నూనె ధర 2024 ఆగస్టులో రూ.110.50 ఉండగా ఈ ఏడాది ఆగస్టు నెలలో రూ.192.73కి పెరిగింది. కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఈ పెరుగుదల ఉంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో వంటనూనె సగటు ధర కిలోకు రూ.114 నుంచి రూ.192కి పెరగడం గమనార్హం. రెండేండ్ల నాటి ధరలతో పోల్చితే ఇప్పు డు అన్ని వస్తువుల ధరలు దాదాపు 60 శాతానికి పైగా పెరిగాయి. గడచిన మూడు నెలలతో పోల్చి నా అన్ని వస్తువుల ధరలు 40 శాతం పెరిగాయి. ఏ ఒక్క వస్తువు ధర కూడా తగ్గిన దాఖలా లేదు.

కేంద్రం వైఫల్యం..ధరల నియంత్రణలో కేంద్రం లోని మోడీసర్కారు వైఫల్యం స్పష్టంగా కనిపి స్తున్నది. సామాన్యుల వంటింటి ఆర్థిక కష్టాలను ఏమాత్రం నియంత్రించలేకపోతోంది. అయితే ఈ ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఎల్‌నినో సాకును ప్రధానంగా చూపుతున్నారు. పంటల దిగుబడి తగ్గిందని ప్రచారం చేస్తున్నారు. దానివల్లే ధరలు పెరుగుతున్నాయని బీజేపీ సోషల్ మీడియా ద్వారా ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నది. డీమార్ట్, రిలయన్స్ వంటి కార్పొరేట్ దిగ్గజ సంస్థలు లక్షల టన్నుల ధాన్యాలను గిడ్డంగుల్లో అక్రమంగా నిల్వ ఉంచి, బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వాటిని విడిపించే కనీస ప్రయత్నం కేంద్రం వైపు నుంచి జరగట్లేదు. పైపెచ్చు దేశంలో నిత్యవసరవస్తువుల కొరతను సాకుగా చూపుతూ విదేశాల నుంచి ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతులు చేసుకొనేందుకు అవకాశాలు కల్పిస్తున్నది. అలా వచ్చిన సరుకు కూడా మళ్లీ కార్పొరేట్ల గోడౌన్లలోకే చేరుతున్నాయని దేశంలోని ఆహారరంగ నిపుణులు చెప్తున్నారు.

నిబంధనలు బేఖాతర్..నిత్యవసర వస్తువులను కార్పొరేట్ సంస్థలు 15 రోజుల అవసరాలకు మించి నిల్వ ఉంచకూడదనే నిబంధన ఉంది. దాన్ని ఏఒక్క సంస్థా పాటించట్లేదు. ఆహార తనిఖీ బృందాలు కనీసం ఆ సంస్థల గోడౌన్లపై దాడులు చేసే పరిస్థితులు కూడా లేవు. తాజాగా చక్కెర నిల్వపై కేంద్రం షరతులు విధించింది. కానీ కార్పొరేట్ సంస్థల గోడౌన్లలో ఎంత స్టాక్ నిల్వ ఉందనే గణాంకాలను మాత్రం వెల్లడించలేదు.

కూరగాయలదీ అదే దారి..దేశంలో కూరగాయల ధరలూ భారీగా పెరిగాయి. టమోట, ఉల్లిపాయలు, బీన్స్, బెండ కాయలు, కాప్సికం, ఆలుగడ్డ వంటి అన్ని కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. నిన్న మొన్నటి వరకు రూ.10 నుంచి రూ.15 వరకు ఉన్న కిలో టమోట ధర ఇప్పుడు దాదాపు రూ.40కి చేరింది. ఆకు కూరల ధరలు కూడా పెరిగాయి. భయపెడుతున్న ఆహార ద్రవ్యోల్బణం.. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కుదిపేస్తోంది.

## రక్షణ పరికరాల సరఫరాలో సింగరేణి నిర్లక్ష్యం!..



- తీవ్ర ఇబ్బందుల్లో కార్మికులు
- అందుబాటులో లేని డ్రిల్‌రాడ్లు, బిట్లు, పైకప్పు సపోర్టులు
- పాత మెషిన్లు రిపేర్ చేసి వాడకం
- పట్టించుకోని యాజమాన్యం

జయశంకర్‌భూపాలపల్లి, ఆగస్టు 23 : సింగరేణి కంపెనీలో పరికరాల కొరత కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. గని లోపల పనిచేసే స్థలాల్లో కీలకమైన యంత్రాలు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతున్నది. నాసిరకం పరికరాలు అందించడం వల్ల యంత్రాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. గనుల్లో పని చేసే కోల్ కట్టర్లు, సపోర్ట్ మెన్లు, లైన్‌మెన్లు, టింబర్ మెన్లకు పనిస్థలాల్లో అవసరమైన డ్రిల్‌రాడ్లు, డ్రిల్ బిట్లు, పైకప్పు సపోర్టులు, ఇతర విడిభాగాలు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపో వడంతో పాత వాటినే మరమ్మతులు చేసి వినియోగించాల్సి వస్తున్నదని కార్మికులు పేర్కొంటున్నారు. కమీషన్లకు ఆశపడి క్వాలిటీలేని పరికరాలు అందజేస్తున్నారని బాధపడుతున్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అవసరమైన డ్రిల్‌రాడ్లు, డ్రిల్‌బిట్ల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం అరిగిపోయిన డ్రిల్‌రాడ్లకు మరో భాగాన్ని జతచేసి ఉపయోగిస్తున్నారు. ఒక డ్రిల్‌యంత్రంతో సగటున 50 రంధ్రాలు వేయగలిగే పరిస్థితి ఉండగా, పాతరాడ్లు, పాతబిట్లతో పని చేయడం వల్ల కార్మికులపై పనిభారం తీవ్రంగా పెరుగుతున్నది. దీంతో కోల్‌కట్టర్లు, సార్ట్‌మెన్స్, టింబర్‌మెన్లు నానా అవస్థలు పడుతున్నారు. భూగర్భ గనుల్లో పైకప్పు కూలిపోకుండా రక్షణగా ఉపయోగించే కర్ర దిమ్మలు, ఇనుప స్రాప్స్ కూడా అందుబాటులో లేవు. జూన్‌లో ఇవ్వాల్సిన బూట్లు, హ్యాండ్‌గ్లౌజ్‌లు సైతం ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో పాతవాటితోనే పనిచేస్తున్నామని వాపోతున్నారు.

## అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు



హైదరాబాద్, ఆగస్టు 23: గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జయ గిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ లో ఆదివారం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాద వులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జేఏసి వెం కన్న,రాముయాదవ్,చిన్న యాదవ్,బైరు అనిల్ కుమార్, నర్సింగ్, మర్రి శ్రీనివాస్,శెంకర్, లక్ష్మణ్ యాదవ్,చిట్టీ బాబు,మల్లేష్, రాజా, గణేష్ నాయక్, హబీబ్,బాను,విజయ్, సుధాకర్,లక్ష్మణ్ చారి,శ్రీని వాస్ కపూర్,సురేష్, దత్తు,సిద్ధులు,మహిళా నాయకురాలు,అనిత, లక్ష్మీ,లలితా, సుమతి, మౌనికా,శైలజ తదితరులు పాల్గొన్నారు,

## నేడు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు




హైదరాబాద్, ఆగస్టు 23: రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సోమవారం నాడు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి లోకనాధం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి తెలిపారు. సామాజిక శంఖారావం, కులవివక్ష లేని సమాజం కోసం చేపట్టిన అధ్యయన యాత్రల్లో 26 జిల్లాలు, 380 మండలాలు, 1,243 గ్రామా లు, 63 పట్టణాలు, 236 వార్డుల్లో దళితుల సమస్యలను గుర్తించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 660 శ్మశాన వాటికలు, 405 ఇళ్ల స్థలాలు, 302 భూ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రతి దళితవాడకు జిఓ 1235 ప్రకారం శ్మశాన వాటికలు ఏర్పాటు చేసి, ఆక్రమణలు తొలగించాలని కోరారు. దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు, ఆక్రమిత భూములను తిరిగి బాధితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం, ఇంటి పట్టా ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. అధ్యయన యాత్రల్లో గుర్తించిన ప్రతి సమస్యపై జిల్లాలవారీ ప్రత్యేక సమీక్ష నిర్వహించి, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సోమవారం నాడు జరిగే ధర్నాల్లో దళితులు, గిరిజనులు, కార్మికులు, రైతులు, మహిళలు, యువత, ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం.. ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 23: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టలక్ష్మణ్ విమర్శిం చారు. హైదరాబాద్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాల యంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు.

# సంపాదకీయం

# రూపాయి బియ్యంతో దళారుల దందా

ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్రమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేద వాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్ధిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్ఛరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగ స్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొం దుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

# నా భర్తను విడిచి పెట్టండి

## బ్రిటన్‌కు భారతీయ నావికుడి భార్య వినతి

న్యూఢిల్లీ,ఆగస్ట్23 : రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్‌పై ఇటీవల బ్రిటన్ దళాలు దాడి చేసి.. ఓ భారతీయుడిని అరెస్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ భారత నావికుడి భార్య మాట్లాడుతూ.. తన భర్తను బలిపశువును చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కేవలం తన యజమాని ఆదేశాలను మాత్రమే పాటించారని చెప్పారు. సదరు నౌక ఇంగ్లిష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తుండగా.. బ్రిటన్ కమాండోలు అందులోకి ప్రవేశించారు. నౌక కెప్టెన్‌గా ఉన్న 38ఏళ్ల అజయ్ పంత్‌ను అరెస్ట్ చేశారు. ఇటీవల అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో అతడు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అజయ్ భార్య రితూ పంత్ మీడియాతో మాట్లాడుతూ.. 'నౌక యజమాని వద్ద నా భర్త కేవలం ఓ ఉద్యోగి మాత్రమే. యాజమాన్యం ఎలా చెబితే అలాగే చేశారు. తాను చేసిన తప్పేంటో కూడా అర్థం కావట్లేదని ఆయన వాపోతున్నారు. చేయని తప్పునకు జైల్లో కుమిలిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నౌకలో



98వేల టన్నుల చమురును అక్రమంగా రవాణా చేస్తున్నారన్నది బ్రిటన్ ఆరోపణ. నౌక కెప్టెన్‌గా కార్గోలో ఏముందో అజయ్ పంత్‌కు కచ్చితంగా తెలుసునని బ్రిటిష్ ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. అయితే, దీన్ని అజయ్ న్యాయవాది తోసిపుచ్చారు. కెప్టెన్ బాధ్యత కేవలం నౌకలోని కార్గోను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమేనని, అందులో ఏముందో వారికి తెలిసే అవకాశం లేదని అన్నారు. ఈ కేసుపై డిసెంబరు 15 నుంచి విచారణ జరగనుంది. మరోవైపు, కాన్సులార్ అనుమతితో బ్రిటన్ జైల్లో ఉన్న అజయ్ పంత్‌ను భారత విదేశాంగ శాఖ కలిసి ఘటన గురించి తెలుసుకుంది. జూన్ 14న ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కామెరూన్ జెండాతో ఉన్న చమురు ట్యాంకర్ 'స్మిట్రోస్'.. ఇంగ్లిష్ ఛానల్‌లో ప్రయాణిస్తున్న సమయంలో బ్రిటన్ సైనిక దళాలు అందులోకి ప్రవేశించాయి. 6 గంటలపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో బ్రిటన్ రాయల్ మెరైన్ కమాండోలు, ఎన్‌సీఏ అధికారులు పాల్గొన్నారు. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా.. కెప్టెన్‌గా ఉన్న అజయ్‌ను బ్రిటన్ దళాలు అరెస్ట్ చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను వివిధ దేశాల జెండాలతో నడుపుతోంది. ఈ 'షాడో ఫ్లీట్'లో భాగంగానే ఈ ట్యాంకర్ రష్యా నుంచి చమురు రవాణా చేస్తోందని బ్రిటన్ ఆరోపించింది. జూన్ 5న ఇది రష్యా పోర్టు నుంచి ఈజిప్టునకు బయల్దేరిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ నౌక ఇంగ్లాండ్ దక్షిణ తీరంలో ఓ సురక్షిత స్థానంలో ఉంది.

# సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు



## ● ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాలకే బోనస్

హైదరాబాద్, ఆగస్టు 23 : తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు 500 రూపాయల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకు న్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి-2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికా రులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.

# 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు

## ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

విశాఖపట్టణం,ఆగస్ట్23 : కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు జెట్టీ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల బోటు గత 19 రోజులుగా కనిపించకుండాపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 3న వేటకు బయలుదేరిన ఈ బోటుతో 5వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్ తెగిపోయింది. సాధారణంగా వేటకు వెళ్లినవారు తిరిగొస్తారనే నమ్మకంతో కుటుంబసభ్యులు ఈ నెల 13వ తేదీ వరకు వేచి చూశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి బాధితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ గాలింపు చర్యల్లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు కోస్ట్‌గార్డ్ నౌకలతో పాటు రెండు నేవీ హెలికాప్టర్లు బంగాళాఖాతంలో తీవ్రంగా శోధిస్తున్నాయి. విశాఖపట్నం, చెన్నై నుంచి వచ్చిన నేవీ నౌకలు సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగిస్తున్నాయి. కాకినాడ, విశాఖ కోస్ట్ గార్డ్ బృందాలు, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో నేడు ఐదో రోజు కూడా గాలింపు ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసులు బాధితుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి, వారి కాల్ డేటాను విశ్లేషిస్తూ సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, సదరు బోటులో ముందస్తు జాగ్రత్తగాఈ ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్లే కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయి, వారి లొకేషన్‌ను గుర్తించడం కష్టతరంగా మారింది. మత్స్యకారుల ఆచూకీ కోసం



గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలతో ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను రాజమండ్రి ప్రతినిధి శ్రీనివాస్ త్వరలోనే అందించనున్నారు.

# హర్మ్యూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక



## ● ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు

వాషింగ్టన్,ఆగస్ట్23 : పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసాయి తారాస్థాయికి చేరేలా ఉన్నాయి. హర్మ్యూజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పట్టువీడకపోవడమే అందుకు కారణం. హర్మ్యూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అయినా సరే ఇరాన్ మాత్రం వెరవడం లేదు. మరోసారి తమను భయపెట్టాలని చూస్తే విధ్వంసకరంగా బదులిస్తామని పేర్కొంది టెహ్రాన్. ఆరు నెలలకు పైగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభాం చూపిస్తోంది ఇరాన్ ? ఇజ్రాయేల్ ? అమెరికా యుద్ధం. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మ్యూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం.. అమెరికా మాత్రం ఆ జలసంధిని తమ భూభాగంగా ప్రకటించడం తాజాగా మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోశాయి.

# 3దశాబ్దాల వెలిగొండ కల సాకారం

- ఆగస్టు 31న వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల
- మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం అందించిన సీఎం
- నిర్వాసితులకు చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి

అమరావతి, ఆగస్టు 23: మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 ఏళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి నీళ్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాల యంలో శుక్రవారం వెలిగొండ నిర్వాసితు లకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సీఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుం బాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సీఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితు లకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆయా జిల్లాల ప్రజల 30 ఏళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సీఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996 లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తు న్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదృష్టం. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకో వాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగా- గోదా వరి- కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదిం చాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రత వస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెం బరు లోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వా న్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను."అని ముఖ్యమంత్రి అన్నారు. పునరా వాస ప్యాకేజీ పై నిర్వాసితుల సంతృప్తి గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని.. నాటి సీఎం ప్రకాశంకు వచ్చినప్పుడు పరిహారం అడుగు తామని నోటీసులు ఇచ్చి బయటకు రాకుండా చేశారని.. ప్రాజెక్టు కింద పొలాలను కోల్పోయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సంతోషం కలిగించిందని వెలిగొండ నిర్వాసిత రైతు కాశిరెడ్డి అన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు ను ఆయనే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని.. తాము కలగా భావించిన ప్రాజెక్టు తమ కళ్ల ముందే సాకారమైందని..తమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు రావటం సంతోషంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు అన్నారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# ఇరుముడి బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్



మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో మంచి జోష్‌లో దూసుకెళ్తుంది. రిలీజ్ అయిన ఫస్ట్ డేనే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా.. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనతో భారీ వసూళ్ల దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో 'ఇరుముడి'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే పూర్తి నమ్మకంతో ముందుకు వెళ్లినట్లు సమాచారం. కథ, కాన్సెప్ట్‌పై నమ్మకం ఉన్నప్పటికీ.. ఓటీటీ రైట్స్ విషయంలో సినిమా స్టార్టింగ్‌లో మాత్రం అనుకున్న స్థాయిలో ఆసక్తి కనిపించలేదనే ప్రచారం జరిగింది. ముఖ్యంగా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ తొలుత 'ఇరుముడి' డిజిటల్ రైట్స్‌పై పెద్దగా ఆసక్తి చూపలేదని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపించింది. అయినప్పటికీ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కడా వెనక్కి తగ్గకుండా.. కథ, రవితేజ పాత్ర, శివ నిర్వాణ టేకింగ్‌పై ఉన్న నమ్మకంతో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. సినిమా ప్రమోషన్స్ మొదలైన తర్వాత పరిస్థితులు మారినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ముఖ్యంగా 'ఇరుముడి' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తర్వాత సినిమాపై ఒక్కసారిగా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరగడంతో పాటు, ఈ చిత్రంలో రవితేజను ఇంతకుముందెన్నడూ చూడని విధంగా కొత్త తరహా పాత్రలో చూపిస్తున్నారనే విషయం బయటకు రావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు ఈ మూవీపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రేజ్‌ను గమనించిన నెట్‌ఫ్లిక్స్.. ఆ తర్వాత 'ఇరుముడి' డిజిటల్ రైట్స్ కొనుగోలుకు ఆసక్తి చూపినట్లు ప్రచారం జరుగుతోంది. చివరకు మైత్రీ మూవీ మేకర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఓటీటీ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు ప్రస్తుతం సినీ వర్గాల్లో జోరుగా



చర్చ సాగుతోంది. ప్రస్తుతం థియేటర్లలో ఈ సినిమాకు వస్తున్న స్పందనను చూస్తే.. మైత్రీ మూవీ మేకర్స్ ఈ కథపై పెట్టుకున్న నమ్మకం ఫలించినట్లే కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా మంచి వసూళ్లు సాధించే దిశగా దూసుకెళ్తుండగా.. మరోవైపు డిజిటల్ రైట్స్ దక్కించుకున్న నెట్‌ఫ్లిక్స్‌కు కూడా ఈ విజయం కలిసొచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# CINEMA

## చిరు సినిమాకు కాకాగా టైటిల్

### బడర్త్‌డే సందర్భంగా టైటిల్ రిలీజ్



అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐలవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయ నకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలు స్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నా నిజమైన హీరో మా అన్నయే

మెగాస్టార్‌గా చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ ప్రత్యేక రోజున జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, ఎప్పటికీ తన హీరోనే అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటూ, వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి రావడం తమ కుటుంబానికి పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని, ఆయన తిరిగి వచ్చే వరకు ఆ ఆనందం ఉండేది కాదని భావోద్వేగంగా రాశారు.తన పాఠశాల రోజుల నుంచే





అన్నయ్యపై తనకు ఎంతో గర్వం ఉండేదని పవన్ తెలిపారు. చిరంజీవి ఇంకా హీరో కాకముందే తన దృష్టిలో ఆయన హీరో అని చెప్పారు. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలు ధరించి తమ తండ్రి బు÷-లలెట్ బైక్ నడుపుతూ కనిపించే చిరంజీవిని చూసిన క్షణాలు ఇప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాలలో ప్రత్యేకంగా నిలిచిపోయాయని చెప్పారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య సాంస్కృతిక వారధిగా చిరంజీవి కీలక పాత్ర పోషించారని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. సాంకేతికతపై ఆసక్తి, దాతృత్వం, కుటుంబంపై ప్రేమ, నటుడిగా సాధించిన అపారమైన విజయాలు.. కేంద్ర మంత్రిగా నిర్వహించిన బాధ్యతలు.. జాతీయ పురస్కారాలు, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత గౌరవాలు అందుకున్నప్పటికీ ఆయనలో పనిచేయాలనే తపన మాత్రం ఎప్పుడూ తగ్గలేదని పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్యపరమైన చికిత్స తర్వాత కూడా చిరంజీవి ఎంతో వేగంగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లకు వెళ్లడం ఆయనలోని అద్భుతమైన శక్తికి నిదర్శనమని పవన్ అన్నారు. 'నగరం ఎప్పుడూ నిద్రపోనట్లే, ఆయన కూడా ఎప్పుడూ విశ్రమించరు. అందుకే ఆయన మా ప్రియమైన మెగాస్టార్.. నాకు మాత్రం ఎప్పటికీ నా ఏకైక హీరో' అంటూ పవన్ తన అన్నయ్యపై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

# స్పిరిట్ కోసం భారీ పారితోషికం డిమాండ్



## నటి దీపికా పడుకొణెపై ప్రణయ్ ఆరోపణలు


ప్రభాస్ హీరోగా సందీప్ వంగా దర్శకత్వంలో రానున్న చిత్రం 'స్పిరిట్' నుంచి దీపికా పదుకొణె వైదొలగడంపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. తాజాగా సందీప్ సోదరుడు ప్రణయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆమె ప్రాజెక్ట్‌ను నుంచి వెళ్లిపోవడానికి కారణాన్ని పంచుకోవడంతో ఈ విషయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. దీపిక ఈ సినిమా నుంచి వైదొలగడానికి కారణాన్ని ప్రణయ్ వివరించారు. తన డేట్స్ సర్దుబాటు చేయడంతో పాటు దీపిక భారీ పారితోషికం అడిగారని చెప్పారు. అలాగే సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని తెలిపారు. ఈ కామెంట్స్ ఒక్క రోజుల్లోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారాయి. తాజాగా దీనిపై ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేసి తన స్పందనను పరోక్షంగా తెలిపారు. 'ఒక మహిళ ఇలాంటి డిమాండ్‌లు చేస్తే సహించలేకపోతున్నారు. ఆమె నో చెప్పడం వల్ల ఈగో సమస్యలు వచ్చాయి. ఇది కేవలం పురుషాధిక్య అహంకార సమస్య మాత్రమే అని ఇన్‌స్టాలో ఒకరు పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేయడం ఇప్పుడు వైరల్ అవుతోంది. హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న 'స్పిరిట్' లో మొదట దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. అయితే ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రిని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి.

# వివాహబంధంతో ఒక్కటైన అర్జున్ రాంపాల్,గాబ్రియెల్లా

బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ మరోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. 'ధురంధర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విలన్‌గా మరింత గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ రాంపాల్.. తన ప్రియురాలు, మోడల్, నటి గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌ను అధికారికంగా వివాహం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట తాజాగా తమ బంధానికి అధికారికంగా మూడుముళ్ల బంధంతో ముగింపు పలికింది. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లు ఉత్తర గోవాలోని మపుసా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ జంట కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి సందర్భంగా ఇద్దరూ ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా చాలా సింపుల్‌గా సాధారణ దుస్తుల్లో కనిపించారు. రిజిస్టర్ మ్యారేజ్ సమయంలో కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు, అత్యంత సన్నిహితులు మాత్రమే వారితో ఉన్నట్లు సమాచారం. గోవాలో అమల్లో ఉన్న యూనిఫామ్ సివిల్ కోడ్ నిబంధనల ప్రకారం వీరి వివాహం నమోదు చేసినట్లు మపుసా సబ్-రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ వెల్లడించారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ 2018 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. చాలా కాలంగా కలిసి జీవిస్తున్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మాత్రం పెద్దగా బయటకు వెల్లడించలేదు. అయితే సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కలిసి కనిపిస్తూ తమ అభిమానులకు తమ బంధాన్ని పరిచయం చేస్తూ వచ్చారు.



# రాకా సినిమా కోసం ప్రత్యేక ప్రపంచం సృష్టి




## సినిమా షూటింగ్‌ను సందర్శించిన మంచు లక్ష్మి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అట్లీ తన గత చిత్రాలకు భిన్నంగా ఈసారి సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌ను ఎంచుకోవడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే అల్లు అర్జున్ లుక్, అట్లీ మేకింగ్ స్టైల్ గురించి రకరకాల వార్తలు వైరల్ అవుతుండగా.. తాజాగా నటి మంచు లక్ష్మి చేసిన కామెంట్స్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ఇటీవల మంచు లక్ష్మి 'రాకా' షూటింగ్ జరుగుతున్న సెట్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న చిత్రీకరణను చూసి తాను ఆశ్చర్యపోయానని ఆమె చెప్పుకొచ్చారు. ముఖ్యంగా సినిమా కోసం సృష్టించిన ప్రపంచం, భారీ సెట్స్, విజువల్ ఎలిమెంట్స్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తాను చూడని ఒక కొత్త ప్రపంచాన్ని అక్కడ చూశానని మంచు లక్ష్మి పేర్కొన్నారు. సినిమాలో భాగంగా కనిపించే కొన్ని జీవులు, ప్రాణుల డిజైన్లు కూడా తనను ఆశ్చర్యానికి గురిచేశాయని ఆమె వెల్లడించారు. దీంతో 'రాకా' సాధారణ యాక్షన్ సినిమా కాదనే విషయం మరింత స్పష్టమవుతోందనే చర్చ మొదలైంది. 'రాకా'ను సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు సినిమాలోని ప్రపంచం ఎలా ఉండబోతుందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కొత్త తరహా విజువల్స్, భారీ యాక్షన్ సీక్వెన్సులు, ఊహకు అందని క్రియేచర్స్‌తో దర్శకుడు అట్లీ ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప' సినిమాతో సొంతం చేసుకున్న క్రేజ్‌కు తగ్గట్టుగానే ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్, అట్లీ కలిసి ఎలాంటి విజువల్ వండర్‌ను సృష్టించబోతున్నారో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం మాత్రం మంచు లక్ష్మి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ 'రాకా'పై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి.

